

## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాధుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

--- శ్రీ బాబూజీ

## పత్రికలో పేజీలు


| | | | |
|---|---|---|---|
| 1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి! | శ్రీ బాబూజీ | ............... | 2 |
| 2. ఉన్నమాట - అనుకున్న మాట (కరుణ అపారం..) | గురుబంధువులు | ............... | 3 |
| 3. ఆత్మావతరణము | శ్రీ బాబూజీ | ............... | 5 |
| 4. సత్సంగోచ్ఛిష్టము (బ్రతుకుతున్నాం..) | గురుకృప | ............... | 16 |
| 5. ప్రేమ బంధం - ప్రేగు బంధం | ధర్మావతి | ............... | 18 |
| 6. సద్గురు దర్శనం - నా బిడ్డల ప్రగతే నిదర్శనం | లక్ష్మి | ............... | 19 |


గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి
**leelas@guruji.org** కి mail చేయగలరు.
ఇంటర్‌నెట్‌లో "గురుకృప" - Visit : **www.guruji.org**







ఈ విషయాన్ని పంచుకున్నాను. తరువాత సంవత్సరం 2005 వార్షికోత్సవంలో శ్రీ బాబూజీ అనుగ్రహంతో నాకు కలిగిన పాప శ్రీ భార్గవిని తీసుకొని ఎంతో ఆనందంగా గురుబంధువులందరితో నా ఆనందాన్ని పంచుకున్నాను. చరిత్రలో బాబా తన భక్తులకు బిడ్డలనిచ్చిన వైనాన్ని చదివి ఆనందించా, నా ఈ అనుభవంతో గురుదేవుల అనుగ్రహానికి పులకించిపోయాను.

-ధర్మావతి, స్వర్ణభారతి నగరం

## సద్గురు దర్శనం - నా బిడ్డల ప్రగతే నిదర్శనం

సప్త సముద్రాల ఆవలనున్నా బిడ్డను రక్షించుకొనే తత్త్వం నేడు పూజ్య గురుదేవుల రూపంలో ఈ ఇలలో అవతరించింది. తన బిడ్డల గురించి చింతించింది ఒక తల్లి. చింతించే బిడ్డను చూసి ఇలలో దైవం కలలో కనిపించారు. ఆ తల్లి బాధను విన్నారు, తాను ఉన్నానని బోధ పరిచారు. దర్శన మిచ్చిన గురుదేవుల కరుణకు ఆనందించింది. బిడ్డల ప్రగతి చూసి పరవశించింది. చింత లేదింక మీ చెంత......... నిశ్చింతతో జీవితమే ఒక పులకింత.

నా పేరు లక్ష్మి. మాది వెంటూరు గ్రామం. మొన్న అక్టోబరు 2004కు మా ఊరిలో సత్సంగం ప్రారంభమయి ఏడాది గడిచింది. అప్పటినుండి నేను బాబా, బాబూజీల నామ స్మరణ చేస్తుండేదాన్ని. ఒక రోజు మధ్యాహ్నం (ఆగష్టు 13, 2004) గం॥1.30ని॥ల ప్రాంతంలో నా పిల్లల చదువు గురించి ఆందోళన చెందుతూ పడుకొన్నాను. పూజ్య గురుదేవులు కలలో దర్శనమిచ్చారు. నేను వారి పాదాలపై పడి, శరణు వేడి 'పిల్లల చదువుల' గురించి చెప్పుకొని భోరున ఏడ్చేశాను. వారు నా తల పైకెత్తి ప్రేమతో తల నిమిరి 'పిల్లల చదువులు బాగున్నాయి' అని నాతో స్పష్టంగా చెప్పారు. అప్పటినుండి పిల్లల చదువులో మార్పు వచ్చి నా ఇద్దరు బిడ్డలకు ప్రతి పరీక్షలోను 92% మార్కులు వస్తున్నాయి. ఇక నాకు ఏ చింతా లేదు. నా బిడ్డలను ఉన్నత స్థాయికి చేర్చి, వారి జీవితాలను గురుదేవులే శోభప్రదం చేస్తారని నా విశ్వాసం.

- డి. లక్ష్మి, వెంటూరు

గురువు చేసే సహాయం కొలతల కందేది కాదు. జన్మజన్మలకు మనవెంట ఉండి, మనలను రక్షించేది గురువు ఒక్కరే. గురువు చిరునామా మనకు తెలియదు. కాని, మనం ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా మన చిరునామా మాత్రం మన గురువుకెరుక. మనం గమ్యం చేరే వరకు మనలను గురువు మాత్రం విడిచిపెట్టరు.

- సత్సంగ సుమాలు







## ప్రేమ బంధం - ప్రేగు బంధం

ఈ మధ్య కాలంలోనే వెలువడ్డ ఒక సైన్స్ పరిశోధన తేల్చిన సత్యం ఏమంటే, తల్లి యొక్క మానసిక స్థితి, బిడ్డలోని భావాలపై ప్రభావాన్ని చూపుతుందని. ఎన్నో జన్యు పరిశోధనల అనంతరం ఈ సత్యాన్ని తెలుసుకొన్నారు శాస్త్రజ్ఞులు. ప్రేగు తెంచుకు పుట్టిన బిడ్డపై ఈ మమకారం, ప్రభావం.... ఊహించగలం, ఆ ప్రేమను. అయితే ఈ ప్రేగు బంధాలకు అంకురార్పణ ప్రేమ బంధమన్నది చరిత్ర తెలిపే సత్యం. దత్త భక్తుడైన సింధియాకు తన శరీరం చీల్చి బిడ్డను ప్రసాదించిన బాబా కరుణ, రెండు వివాహాలైన బిడ్డలులేరన్న వ్యధకు గురైన నానా సాహెబ్ డేంగ్లేకు పుత్రుడ్ని ప్రసాదించిన సాయిలీల, సర్వమూ ఉన్నా సంతానం లేదన్న చింతతో దుఃఖితుడైన రతన్ జీ షాపుర్జీకి సంతానాన్ని అందించిన వైనం... ఇలా ఎందరో సాయి భక్తులు - సంతాన ప్రాప్తులు చరితలో. అలాంటి ఎన్నో అనుభవాలు బాబూజీ చెంత క్రితం గురుకృపలలో చూసి మనం పులకింత... అయితే ఈ గురుబంధువు విషయంలో వివాహబంధానికి విలువనివ్వాల్సిన భర్త కూడా ఒక సందర్భంలో బిడ్డలు లేక ఈసడించాడు. ఒక సం॥ కాలంలో బిడ్డ నివ్వకపోతే, బాబా నెత్తిన టెంకాయ పగలగొడతానని శ్యామా ప్రేమతో ఆనాడు చెపితే, అదే సం॥ కాలంలో బాబూజీ ఆమెకు ప్రేగు బంధాన్ని - వారి ప్రేమబంధంతో ప్రసాదించారు, ఆ వివాహబంధాన్ని బలపరిచారు. ఇక అనుభవాన్ని ఆస్వాదిద్దాం.

– **గురుకృప**

పూజ్య గురుదేవులు శ్రీ బాబూజీ పాదపద్మములకు నమస్కరిస్తూ, వారు నాకిచ్చిన ఒక అనుభవాన్ని మీతో పంచుకుంటున్నాను. నా పేరు ధర్మావతి. మాది స్వర్ణభారతి నగరం. నేను గీతం డెంటల్ కళాశాలలో నర్సుగా పనిచేస్తున్నాను. నాకు పెళ్ళయి 5సం॥లు అయింది. అయినా నాకు పిల్లలు లేరు. ఈ విషయమై నాకు, మావారికి ఎప్పుడూ గొడవలు అవుతూ ఉండేవి. ఒకసారి ఏకంగా మావారు నీకు పిల్లలు పుట్టరు కనుక నిన్ను వదిలేస్తాను అని అనడం జరిగింది. అప్పుడు నేను గురుబంధువు వెంకట్రావు గారితో చెప్పుకొని బాధపడ్డాను కూడా. అప్పుడు తను చెప్పారు, శ్రీ బాబూజీ తో నా బాధను విన్నవించుకోమని. అదే విధంగా నేను సత్సంగానికి చేరి గురుదేవులతో నా బాధను చెప్పుకోవడం జరిగింది. నన్ను, మావారిని కలిపారు గురుదేవులు. తరువాత మేము ఋషికొండలో ఇల్లు అద్దెకు తీసుకోవడం, ప్రతీ గురువారం నేను సత్సంగానికి వెళుతూఉండటం జరుగుతూ వచ్చింది. నేను ఋషికొండ 2004 సత్సంగ వార్షికోత్సవంలో నా బాధను గురుదేవులతో చెప్పుకుంటూ గురుబంధువులందరితో









సంపుటి : 9
సంచిక : 2
త్రైమాసిక పత్రిక
ఏప్రియల్ 2006

**నిర్వహణ**
గురూజీ ఆశీస్సులతో గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
2-1-6
గాంధీచౌక్
తెనాలి - 01

☎ 08644 227194 (O)

**ముద్రణ**
రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం
ఫోన్స్ : 2798072, 2740222

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహరాజ్‌కీ జై !
సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై !

# గురుకృప

## కరుణ అపారం - మహిమ అనంతం

శిరిడీ చేరిన గురుబంధువులంతా గురుదేవుల దర్శనంతో పులకించిపోతే, గురుదేవుల అనుగ్రహంతో, టెక్నాలజీ అందించిన కొత్తదనంతో ఇంటర్‌నెట్‌లో గురుదేవులను దర్శించి కొందరు మైమరిస్తే, సాయినామఝరిలో తడుస్తూ, ఆర్తిగా సద్గురుమూర్తిని తమ హృదయమందిరాల్లోకి ఆహ్వానిస్తూ గురుబంధువులంతా నూతనవత్సరాన్ని ఆహ్వానించారు. ఈ నూతనవత్సరం సద్గురు చంద్రుని కమనీయ దర్శనంతో ఒక మధుర కావ్యంలా ప్రారంభమయింది.

'గురుకృప' జన్మదిన సంచిక వెలువడి మూడు రోజులే అయిందా! అన్నట్లు ఉండగానే శ్రీరామనవమి సంచికకు ముస్తాబవుతోంది. ఒక సందేహం, ఇంత త్వరగా గడిచిపోయిన కాలం భారంగా గడిచిందా! భవ్యంగా గడిచిందా! భారంగా గడిస్తే గడిచే కాలం గమనింపులో ఉంటుంది కదా! కాబట్టి భవ్యంగానే గడిచింది. ఈ ఆనందంలోనే ఒక ఆలోచన. గడిచిన కాలాన్ని పిడకలేరుకునేందుకు ఉపయోగించుకున్నామా! లేక సద్గురువును తెలుసుకొనే ప్రయత్నంలో, సద్గురు స్మరణలో, ధ్యాసలో, ఊసులో గడిపామా? గమనించుకునే ప్రయత్నం చేద్దాం.

'ఉత్తిష్టత జాగ్రత ప్రాప్య వరాన్ని బోధిత' - 'మేలుకోండి, జాగరూకులు కండి, మీకు ప్రాప్తించిన మానవజన్మ ఎంత అమూల్యమైనదో అర్థం చేసుకోండి, సద్వినియోగం చేసుకోండి.' - అంటుంది కఠోపనిషత్తు. మనిషి ఆయువు ఎంతో స్వల్పం. చూస్తూండగానే రోజు రోజుకి ఆయువు క్షీణించి పోతుందంటారు







–శంకరులు. ఇక ఏడే రోజులు బ్రతుకుతానని తెలిసినపుడు పరీక్షన్మహరాజు బెంగతో ఏడుస్తూ కూర్చొనలేదు, తాను చేయవలసిన ధర్మాన్ని, కర్తవ్యాన్ని నిర్వర్తించి, భాగవత శ్రవణం ద్వారా **'చనిపోతున్నానన్న'** స్థితి నుండి తాను **'శరీరాన్ని విడిచిపెడుతున్నానన్న'** స్థితికి చేరాడు. మిత్రమా! నాలుగు రోజులే ఈ జీవితం, దుర్లభమైన మానవ దేహాన్ని ధరించావు. వృధా చేసుకోకు. సద్గురువును ప్రేమించావా – భవసాగరాన్ని భవ్యంగా దాటేస్తావు అంటారో సంతకవి. మాపు ప్రక్కనే రేపు ఉందని మన భావన, కానీ రేపటి గురించి ఆ సద్గురువుకే తెలియాలి. కనుక ఈ రోజున మనం ఏం చేసాం, ఎలా గడిపామన్నదే ముఖ్యమంటారు మరో బోధకుడు.

**'అతః శ్వః కరణీయాని కుర్వా దద్వైవ బుద్ధిమాన్'** సద్గురు దేవుని ఎరుక గలవారు రేపు చేయాలనుకున్న సత్కార్యాన్ని నేడే పూర్తి చేస్తారంటుంది శాస్త్రం. చేయవలసింది మాని, చేయకూడనిది చేస్తూ పోతే, చివరకు చేయగలిగిందంటూ ఏమీ ఉండదు. విరామ స్థానం లాంటి ఈ విశేష ప్రస్థానమైన జీవితాన్ని కేవలం ఇంద్రియ సుఖాల కోసం, ప్రయోజనం లేని భోగాల కోసం బూడిద చేసుకోవద్దని మరో భాగవతుని హెచ్చరిక. ఇలా కాలం విలువ ఎంత చెప్పుకున్నా కాలుడు దరి చేరతాడేమో కానీ కాలం కథ కంచికి చేరదు.

"మా సాంప్రదాయమే వేరు" అని కేవలం మాటలతో కాదు, వారి జీవన విధానం ద్వారా ఈ మానవాళికి మహిత మార్గం చూపిన బాబా కాలం విలువనే కాదు, కాలం యొక్క లక్ష్యాన్ని, జీవన రహస్యాన్ని – **"సద్గురువును తెలుసుకో ! లేకపోతే ఎందుకు, పిడకలేరుకోవడానికి వచ్చినట్లా !"** అంటూ సద్గురువును తెలుసుకోవడమే మన జీవిత లక్ష్యమని తేల్చి చెప్పారు. పూజ్య గురుదేవులు ఇదే విషయాన్ని మనందరికి మరొక్కసారి ఎరుకపరుస్తూ, కాలం చాలా విలువైనదని, దుర్వినియోగం చేసుకోవద్దని మనలను మేల్కొలిపిన వైనం బిడ్డలపై తండ్రికి ఉన్న ప్రేమను తేట తెల్లం చేస్తుంది. నాడు కేవలం గ్రామంలోని సంతకు వెళ్లద్దన్న బాబా మాటను అలక్ష్యం చేసిన భక్తులకు కలిగిన ఇబ్బందులను తొలగిస్తూ వారిని మేల్కొలిపిన వైనం మనం చరిత్రలో స్పష్టంగా చూసి ఉన్నాం. ఇక కదలాడే దైవమైన గురుదేవుల ఈ మాటలు మన జీవన విధానాన్ని సమూలంగా మార్చి వేస్తాయనడంలో సందేహం లేదు. Attend carefully to the meaning of what I say. Remembering my words will give you happiness.

(తరువాయి 17వ పేజీలో)









(4వ పేజీ తరువాయి)

ఆనందమనే నిండైన పాత్రను అలా అలా ఒలికిస్తూ, బాబా ఆ ఆనందపు అమృత బిందువులను జాలు వార్చితే, అందులోని పరమాణు భాగాన్ని ఆస్వాదిస్తున్న మనం కాలం విలువను తెలుసుకొని, జీవితాన్ని నిర్మాణాత్మకంగా మలుచుకునేందుకు అందిస్తున్న అనుగ్రహంతో, ఆ ఆనంద సాగరంలో మునకలేయచ్చు. అనుగ్రహానందాలను నాడు బాబా బండ్లకెత్తుకెళ్లమని వచిస్తే, అనుగ్రహరాశియైన గురుదేవులు మన జీవితమనే 'పాత్ర'న ఆనందమనే అమృతాన్ని నింపేటందుకు ఆసీనులై ఉన్నారు. బిందువులోని పరమాణు భాగాన్ని ఆస్వాదించిన మనం ఆ ఆనందాన్ని ఆసాంతం నింపుకొనే ప్రయత్నం చేద్దాం. ఇహంలో ఏదైనా సాధించడానికి (Practice makes a man Perfect) అభ్యాసము కూసువిద్య అని బిడ్డలకు వల్లించే మనం, సద్గురు అనుగ్రహాన్ని ఆస్వాదించేటందుకు అభ్యాసాన్ని ఆరంభిద్దాం. కాలాన్ని సద్వినియోగం చేసుకొంటున్నామని మనల్ని మనం మోసం చేసుకోవద్దు. గురుదేవులు వచించినట్లు మన వ్యాపకాల నుండి బయటకు రాగానే సద్గురు స్ఫురణలో గడుపుతూ జీవితాలను నిర్మాణాత్మకంగా మలుచుకుందాం. ఇహంలో ఉద్యోగం గురించి, వివాహం గురించి... ఇతరత్రా వాటి గురించి ఒక నిర్ణీత సమయాన్ని లక్ష్యంగా పెట్టుకొనే మనం సద్గురు అనుగ్రహాన్ని ఆస్వాదించే ప్రయత్నాన్ని అదే నిర్ణీత సమయంతో, లక్ష్యంతో, తదేక దీక్షతో సాగిద్దాం. రేపటి గురించి చింతమాని, గడుస్తున్న ఈ రోజున సద్గురు దేవుని పరంగా మన అడుగుల గురుతులను విశ్లేషించుకొందాం. గురుదేవుల మాటలను బాటలుగా మలచుకొని సద్గురువును తెలుసుకొనే ప్రయత్నంలో మనం సోమరిపోతులం కాదని బాబాకు విన్నవించుకొందాం.

గురుబంధువుల్లారా ! పిడకలేరుకొనే పనికి ఇక సెలవు పలుకుదాం. ప్రతీ క్షణాన్ని సద్గురు స్మరణలో, సద్గురువును తెలుసుకొనే ప్రయత్నంలో ఒక నిర్ణీత లక్ష్యంతో, ఒక ధ్యేయంతో, ప్రణాళికాబద్ధంగా, అడుగులు వేద్దాం....... మరలిపోయిన క్షణాలు మళ్ళీ రావు... మధురంగా మలచుకొందాం.. సద్గురువనే మహా కావ్యంలో మనమూ పాత్ర ధారులమయి జీవితాలను నిత్య కళ్యాణం – పచ్చతోరణంగా సాగిద్దాం.

– **గురుకృప**

**గురుబంధువులకు "వ్యయనామ సంవత్సర" శుభాకాంక్షలు తెలియచేస్తోంది గురుకృప.**






## బ్రతుకుతున్నాం నిత్యం - జీవించడమే సత్యం

"జీవితంలో జరిగే ప్రతీ సంఘటన సద్గురు లీలా ప్రబోధమే" అన్న గురుదేవుల మాటల మాటున దాగిఉన్న ఒక జీవన సత్యాన్ని ఒక చిన్న కథ ద్వారా ఎరుకలోకి తెచ్చుకునే యత్నం. ఒకానొక ఆధ్యాత్మిక సుక్షేత్రంలో సర్వవ్యాపకుడైన సద్గురు మూర్తికై దేవాలయ నిర్మాణం ప్రారంభమయింది. అట్టి మహత్కార్యంలో ఎందరో పనివారు పగలనక రాత్రనక శారీరక శ్రమను వెచ్చిస్తున్నారు. ఆ బాటన సాగిపోతున్న ఒక బాటసారి-చెమట కక్కుతూ, శ్రమిస్తున్న ఒక అతనిని అడిగాడు. "సోదరా ! ఏం చేస్తున్నావు" అని. విసుగు, చిరాకుతో కూడిన ఉద్వేగ స్వరంతో అన్నాడు ఆ శ్రామికుడు – "కన్పించడంలా! రాళ్ళు పగలకొడుతున్నాను". అలా ఇంకొంతముందుకు వెళ్ళి, ఇంకో శ్రామికుడ్ని ప్రశ్నించాడు బాటసారి– "సోదరా! ఏంచేస్తున్నావు" అని. "నా జీవన భృతిని నేను సంపాదించుకొంటున్నాను" అంటూ పరిస్థితులకు తలొగ్గి చేతగాక పనిచేస్తూ సంతోషం కొరవడిన స్వరంతో సమాధానమిచ్చాడు రెండో శ్రామికుడు. మరికొంత దూరం వెళ్ళి మరో శ్రామికుడ్ని ప్రశ్నించాడు బాటసారి – "సోదరా ! ఏం చేస్తున్నావు" అని. తాను చేస్తున్న పనిలో పూర్తిగా నిమగ్నమై, ఆనంద సాగరాన మునిగి తేలుతూ, తన ప్రభువును కీర్తించుకుంటూ తాను చేస్తున్న పనిని ఆస్వాదిస్తున్న శ్రామికుని నుండి సమాధానం లభించలేదు బాటసారికి. మరలా తిరిగి ప్రశ్నించడం బాటసారి వంతు అయ్యింది. వెలిగి పోతున్న వదనంతో, చిరునవ్వుతో ఇలా సమాధానమిచ్చాడు. "సోదరా తెలియదా, ఒక గొప్ప దేవాలయ నిర్మాణంలో పాలుపంచుకునే పాత్రత కల్పించిన ఆ సద్గురుదేవుని కీర్తించుకుంటున్నాను" అంటూ సమాధానమిచ్చాడు. ఆ సమయంలో ఇంకా నిర్మాణం పూర్తి కానప్పటికిని, ఆ దేవాలయాన కొలువుతీరిన సద్గురు దేవుని ఆ శ్రామికుని ముఖంలో దర్శించాడు బాటసారి. ఒకే ప్రశ్న – ఒకే జీవన పరిస్థితి – ఒకే సందర్భం – భిన్న సమాధానాలు. మొదటి శ్రామికుడు బ్రతుకును భారంగా గడుపుతూ, సద్గురువు ప్రసాదించిన జీవితాన్ని ఆస్వాదించలేకపోతున్నాడు. రెండో శ్రామికుడు బ్రతుకును – విధిలేక, మరో మార్గము కానరాక, తనకు ఇష్టము ఉన్నను, లేకను సాగించవలసినదే, కనుక బ్రతుకుతున్నాడు. అయితే మూడో శ్రామికుడు మాత్రం తద్భిన్నమైన భావాన్ని వ్యక్త పరిచాడు. సద్గురువు ప్రసాదించిన ఈ పనిని అతని మనుగడకు – శాంతికి, సంతోషానికి, పూర్ణత్వానికి, కృతజ్ఞతకు, ఆలవాలంగా మార్చుకొని ఒకే సమున్నత లక్ష్యంతో సాగుతూ 'బ్రతకడం' నుంచి 'జీవించడమనే' పరిణితిని సద్గురుని ఊసులో సాధించాడు. సద్గురువు ప్రసాదించిన ఈ సుమధుర జీవితం ఒక గొప్ప వరం. వారు ప్రసాదించిన శాంతి, ప్రేమలను ఆస్వాదిస్తూ జీవన విధానంలోని సత్యాలను తెలుసుకుంటూ, అమూల్యమైన ఈ అవకాశాన్ని సద్గురు చరణార్చనకై వినియోగించు వారు ధన్యులు.



శ్రీ బాబూజీ విరచిత
# ఆత్మావతరణము



# సద్గురు అనుగ్రహ కరదీపిక

సద్గురు దేవులు శ్రీ బాబూజీ చరణములకు శతసహస్రకోటి వందనాలు సమర్పించుకుంటుంది 'గురుకృప' పత్రిక. మహాత్ములు నడిచినదే మనకు బాట – సద్గురు పథమున నడిచిన వారి జీవనము పూలతోట. ప్రపంచంలో నేటి వరకు వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సాంప్రదాయాలన్నింటిపై అధికారికంగా వ్యాఖ్యానించగల ధీశక్తి, అతి పిన్న వయస్సులోనే సుసాధ్యామైన శ్రీ బాబూజీ కలం నుండి వెలువడిన ఆణిముత్యమే, **'ఆత్మావతరణము'**. విద్యానగర్ బాబా మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని 'సద్గురుదర్శనము' అనే సావనీర్ వెలువడడం అందు భగవాన్ రమణ మహర్షి గూర్చిన సంక్షిప్త వ్యాసం 'ఆత్మావతరణము' శ్రీ బాబూజీ రచించడం జరిగింది. గురుదేవులు రచించిన వ్యాసాలు అందు ఉన్నాయని తెలియడంతో, ఆ పుస్తకం చూడాలన్న ఉత్సుకత ఆరంభమయ్యింది. దాంతో ఆ సావనీర్‌ను చూడాలని గత 6 నెలలుగా ప్రయత్నిస్తోంది గురుకృప. విద్యానగర్ బాబా మందిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురుదేవులతో పాటు పాల్గొన్న వారిని, గురుబంధువులను ఆ పుస్తకానికై అడగడం, వారి చెంత అలభ్యమని సమాధానం. పుస్తక పబ్లిషర్స్‌కు ఫోన్ చేసి అడుగగా లేదన్నదే వారి సమాధానం కూడా! సంస్థాగతమైన ఇబ్బందులవల్ల ఆ పుస్తకం అందకపోవడంతో, కొంత అసహనానికి లోనయి గురుదేవులకు చెప్పుకోవడం జరిగింది. "గురుదేవా ! పుస్తకం చూడాలని మా ఆరాటం – ఇక మీ ఏర్పాటుకై వేచి చూస్తాం " అని. పుస్తకం చూడాలన్న ఆకాంక్షను తెనాలిలోని ఇద్దరు యువ గురుబంధువులతో చెప్పగా వారు ఒంగోలు వెళ్ళి ప్రయత్నం చేద్దామని నిశ్చయించుకొన్నారు. ఆ ఇద్దరిలో ఒక యువ గురుబంధువు బాబా దర్శనానికై శిరిడీ బయల్దేరాడు. శబరి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరిన అతనికి ఒక బాబా భక్తుడు శిరిడీ వెళుతూ సాయిలీలా మృతము చదువుకుంటూ కనిపించారు రైలులో. సాయికులస్థులైన ఇరువురు బాబా గురించి మాట్లాడుకుంటూ, ఆ బాబా భక్తుడు, మీరు సాయిపథానికి సంబంధించిన వారుగా కనిపిస్తున్నారు. సద్గురుదర్శనమనే సావనీర్‌లో మీ గురుదేవులు రచించిన వ్యాసాలు చాలా ఆసక్తిగా ఉంటాయి! మీరు చూశారా! అని అడగడం, ఎట్టకేలకు సద్గురు దర్శనం తన వద్ద ఉందని అది మీకివ్వగలనని అతను చెప్పడం, శిరిడీ నుండి ఇరువురూ వచ్చిన వెంటనే సద్గురు దర్శనాన్ని ఒంగోలులో అందివ్వడం జరిగింది. అప్పుడు అర్ధమయ్యింది ***శ్రీ బాబూజీ ఏర్పాటు. కాంక్షించిన దాసులను కరుణించి కరములకందించే సద్గురు అనుగ్రహ కరదీపిక.***

సద్గురుదర్శనమనే సావనీర్ ప్రచురణ అనే చారిత్రక ఘట్టం జరిగి మార్చి 13,2006వ సం॥కు 25 వసంతాలు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ ప్రయత్నం గురుఅనుగ్రహంతో – **అవధరించండి – ఆత్మావతరణం – ఆనందసంద్రం.**



కొడుతుండడం, ఇలా ఏదో ఒకపని చేస్తూనే ఉండేవారు. ఇవికాక కొబ్బరి పెంకులను నున్నగా అరగదీసి వాటితో కప్పులు, గరిటలు తయారుచేసేవారు. పడిపోయిన చెట్లకొమ్మలతో చేతికర్రలు తయారుచేసేవారు. లేకపోతే ప్రెస్ ప్రూఫులు దిద్దుతూ కూర్చునేవారు. భక్తులు చదువుకోడానికి అలభ్యమైన గ్రంధాలకు నకళ్ళు తయారు చేస్తువుండేవారు. నోట్ పుస్తకాలు కుడుతూ, బైండింగ్ చేస్తూ వుండేవారు. లేకపోతే ఉడుతలకు, కోతులకు, నెమళ్ళకు, ఇంకా యితర పక్షులకు, జంతువులకు ఆహారం తినిపిస్తూనో లేక కుక్కల గోళ్ళలోని మట్టంతా తీసి శుభ్రం చేస్తూనో కనిపించేవారు. అంతటి అత్యుత్తమ శ్రేణికి చెందిన మహాత్ముడిలా ప్రాముఖ్యంలేని చిన్న చిన్న పనులను అతిశ్రద్ధతోనూ, ఎంతో నైపుణ్యంతోనూ చేస్తూ వాటిల్లో నిమగ్నమవడం చూస్తే చాలా ఆశ్చర్యంగా వుంటుంది. ఇది చూస్తే జన్‌సాంప్రదాయానికి చెందిన ఒక కవి చెప్పిన వాక్యాలు గుర్తొస్తాయి. "అద్భుతమైన ఆధ్యాత్మిక శక్తి, ఉత్తమమైన క్రియా శక్తి – నీళ్ళు తెచ్చుకోవడం, నిప్పురాజేయడం వంటివి!"

మహర్షి ఉపదేశించే పద్ధతి ఇతరమహాత్ముల సాంప్రదాయాన్ననుసరించే వుండేది. ఆయనెన్నడూ ఎవరికి ఏ మంత్రోపదేశమూ చేయలేదు. "నిజమైన ఉపదేశం మౌనంద్వారా లభిస్తుంది" అనేవారాయన. ఆయన సాన్నిధ్యప్రభావంచే అప్రయత్నంగానే మనస్సు ధ్యానస్థమయేది. అత్యంత అద్భుతమైన ఆధ్మాత్మికానుభూతులు ఆయన సన్నిధిలో కోకొల్లలు.

తొలిరోజుల్లో తమ శరీరాన్ని నిర్లక్ష్యం చేసిన ఫలితం, ఆయనకు 1940లో సర్కోమా వచ్చింది. ఆయన వారిస్తున్నప్పటికి వినక ఉపయోగించిన మందులన్నీ వ్యర్థమయినాయి. మూడుసార్లు శస్త్రచికిత్స చేసినా ఫలితం కనిపించలేదు. మూడుసార్లూ ఆయన శస్త్ర చికిత్సా సమయంలో మత్తుమందు పుచ్చుకోలేదు. భగవాన్‌లో క్షీణిస్తున్న ఆరోగ్యాన్ని చూచి భక్తులాందోళన పడ్తుంటే భగవాన్, "వారంతా నేను చనిపోతానను కుంటున్నారు. నేనెక్కడికి పోతాను? నేనిక్కడే వున్నాను" అన్నారు.

ఆ విషయం అక్షరాల సత్యమే! 1950 ఏప్రియల్ 14వ తేదీన భగవాన్ మహాసమాధి చెందారు. అయితే సమాధి అనంతరం కూడా భక్తుల హృదయాంధకారాన్ని పారద్రోలగల జ్ఞాన కిరణాలను ప్రసరించే ఆయన సాన్నిధ్యం శ్రీ రమణాశ్రమంలో నిత్యానుభవమే!

మహర్షిలోని దివ్యత్వాన్ని అందరు మానవులు అంతటి మేధా సంపత్తితోను గుర్తించలేకపోయినా జంతువులు తమ సహజ ప్రేరణతో గుర్తించ గలిగేవి. మహర్షి సన్నిధిలో ఎంతో అద్భుతమైన మానవ ప్రజ్ఞతో మెలిగిన 'లక్ష్మి' అనే ఆవు సంగతి ప్రసిద్ధమే. ఏదైనా విపత్తు వచ్చినా, కలహాలు వచ్చినా అడవిలోని కోతులుసైతం తీర్పు కోసం ఊరటకోసం మహర్షి నాశ్రయించేవి. ప్రసాద సమయంలో ఆ అడవి కోతులు అసంఖ్యాకంగా వాటికై అవే ఒకదాని వెనుక వరుసగా వచ్చి మహర్షి చేతిగుండా ప్రసాద మందుకుంటుంటే ఆ దృశ్యం దేవతలకు కూడా కన్నుల పండుగ కలిగించేలా వుండేది. క్రూర జంతువులైన పులులు, చిరుత పులులు, త్రాచులు కూడా ఆయన ఆజ్ఞను పాటించేవి.

మహర్షి తల్లి అలగమ్మాళ్ మృత్యుశయ్యపై ఉన్నప్పుడు మహర్షి ఆమెపై దృష్టినిగిడ్చి తమ కుడి చేతిని ఆమె తలపైనా, ఎడమచేతిని ఆమె ఛాతిపైనా వుంచి ఆమె అంతిమ శ్వాస విడచేవరకూ అలానే వున్నారు. మహర్షి స్పర్శతో ఆమెలో ఉత్పన్నమైన యోగశక్తిని ఆమె హృదయంలో పునీతంచేసి ఆమెకు జన్మరాహిత్యం ప్రసాదించారు భగవాన్. ఆమె శ్వాస ఆగిపోగానే అక్కడ నుంచి లేచి, "ఇప్పుడిక ఏ చింతాలేదు, రండి భోంచేద్దాం" అన్నారు. సంతోషంగా మహర్షి తల్లి శరీరాన్ని అరుణగిరి దక్షిణ పాదంలో సమాధి చేశారు. ఆ సమయంలో అంత్యక్రియలకు అవసరమైన పరిశుభ్రమైన నీరు సమాయానికి లభించక పోవడంతో మహర్షి అక్కడే ఒకచోటున నిలచి మట్టితోడారు. అత్యాశ్చర్యకరంగా అక్కడనుంచి నీరు ప్రవహించాయి.

ఆ తీర్థాన్ని భక్తులు అగశమన తీర్థమని లేక శ్రీరమణ తీర్థమనీ అంటారు. బహుళ పవిత్రమైన అరుణగిరినుంచి ప్రవహించే అత్యంత పవిత్రమైన జీవన స్రవంతికది సంకేతం కాబోలు. మహర్షి కొండపై నుంచి అరుణగిరి పాదంవద్దకు దిగిరావడాన్ని గురించి భక్తులు మహర్షి దర్శనానికై తపిస్తూ పర్వతాన్ని అధిరోహించే సామర్థ్యం లేని భక్తులకు సులభంగా తమ దర్శనం లభించడం కోసంగా భక్తసులభుడైన మహర్షే కొండదిగి వచ్చారని భక్తుల విశ్వాసం. తన తండ్రి ఒడిలోనుంచి దిగి వచ్చి ఆయన కార్యంలో అరుణగిరి నుంచి అవతరించి వచ్చారనే భక్తుల విశ్వాసము ఎంత సమంజసం.

మహర్షి కొండదిగి వచ్చి పాలితీర్థం వద్ద స్థిరపడిన నాటి నుంచి ఆయన స్వీయ జీవితం ముగిసిందనే చెప్పాలి. ఆయన ఎప్పుడూ పనిచేస్తూనే వుండే వారు. వంటచేయడం, పాత్రలు శుభ్రపరచడం, పిండి రుబ్బడమూ, కూరలు తరగడం, విస్తళ్ళుకుడుతూ, కట్టెలు



# ఆత్మావతరణము

***నిజమైన మహాత్ముని జీవితము, వారి ద్వారా జరిగే లోకహితకార్యము కూడా నిత్యసత్యాలే! వాటికి ఆదీ-అంతం రెండూ వుండవు.***

అయినా తమిళనాడులోని 'తిరుచ్చిళ్ళి' గ్రామంలో(మధురై దగ్గర) 29 డిశంబరు 1879 తేదీన అలగమ్మాళ్, సుందరం అయ్యర్ దంపతులకు 'భగవాన్ రమణమహర్షి' జన్మించగానే 'ఆత్మావతరణము' అనే అద్భుత చరిత్ర ప్రారంభమయింది. ఆ శిశువుకు వారు వెంకటరామన్ అని నామకరణం చేశారు. వెంకటరామన్ చిన్నతనంలో ఏ అసాధారణ ప్రజ్ఞలూ వ్యక్తమయ్యేవి కావు. మామూలుగా అందరి పిల్లల్లాగానే చదువులో కంటే ఆటలలో ఉత్సాహం ఎక్కువ. అయితే వెంకటరామన్‌లో చెప్పుకోదగ్గ రెండు విశేషాలుండేవి. ఆయన నిద్ర ఒక విశేషం. ఆయన ఎంత గాఢంగా నిద్ర పోయేవారంటే ఆయనను నిద్రలేపడం ఎవరికీ వీలయేది కాదు. చివరకు బలంగా కొట్టినా, తన్నినా ఏం లాభం వుండేది కాదు. ఇంకో చిత్రమైన సంగతేమిటి అంటే చిన్నతనం నుంచీ ఎందుకో, ఏమిటో – 'అరుణాచలం' పేరు వింటే చాలు ఏదో అనిర్వచనీయమైన ప్రేమ, భావోద్రేకాలతో శరీరం గగుర్పొడిచేది. తనలో చిత్రమైన అనుభూతిని, ఆత్మీయతను రేకెత్తించే 'అరుణాచలాన్ని' గురించి నిజానికాయనకేమీ తెలీదు.

ఒకరోజున 'పెరియ పురాణం' (నాయనార్లు అని పిలవబడే అరువది ముప్పురు శైవ మహాత్ముల చరిత్ర) అనే పుస్తకం అనాయాచితంగా ఆయన చేతికందింది. ఆ విషయాన్ని గురించి శ్రీ భగవానే ఒకసారి "నాలో భక్తి భావాన్ని మొట్టమొదటిసారిగా మేల్కొలిపింది ఆ గ్రంథమే! పెరియ పురాణం చదువకముందు దేవాలయంలోగల ఆ అరవై ముప్పురు మహాత్ముల విగ్రహాలు కేవలం రాతి బొమ్మలు మాత్రమే. అయితే పెరియ పురాణం చదివిన తర్వాత ఆ విగ్రహాలే నాలో ఏదో నూతన ప్రేరణ కలిగించేవి" అన్నారు.

పెరియపురాణం చదివిన కొన్ని నెలలకు ఆయన జీవిత విధానాన్నే పూర్తిగా మలచివేసిన ఒక అద్భుతానుభూతి కలిగింది శ్రీ వెంకటరామన్‌కు. 1896 జూలైలో, ఒక రోజున మధురైలోని వారింట్లో మేడమీది గదిలో ఒక్కడే చాలా హాయిగా, విశ్రాంతిగా పడుకుని వున్న వెంకటరామన్‌కు హఠాత్తుగా తాను కొద్ది క్షణాల్లోనే మరణించ బోతున్నానని 'తాను' యింక లేకుండా పోతాననే తీవ్రమైన భీతి అవహించింది. తన శరీరం కట్టెలా బిగుసుకు

పోతున్నట్లాయనకు తెలుస్తోంది. అయితే ఏనాటి అదృష్టమో ఏమో ! ఒక చెంప తన శరీరం అలా బిగుసుకుపోయి నిర్జీవమౌతున్నా అదంతా ఎలా జరుగుతున్నదో, తన శరీరంలో ఏ ఏ మార్పులు కలుగుతున్నాయో, తానుగా తాననుకుంటున్న 'తను' ఏమైపోతున్నాడో స్పష్టంగా గుర్తించే ధైర్యమూ, ప్రజ్ఞ కలిగాయి. కొంతసేపటికి 'తాను' తన శరీరానికి భిన్నంగా వున్నానని, తనంటే ఒక చైతన్యశక్తియని, నిశ్చలమైన ఆ చైతన్యశక్తియే శరీరాన్ని పనిచేయిస్తున్నదని అవగతమయింది వెంకటరామన్‌కు. కదలికకూ, పనిచేయడానికి, మాట్లాడడానికి, ఆలోచించడానికి మూలమైన ఆ చైతన్యశక్తియే తాననే గుర్తింపు స్పష్టమైంది. పదిహేను నిమిషాలు గడిచాక వెంకటరామన్‌లో మృత్యు చిహ్నాలు అంతరించాయి. శరీరం పూర్తిగా స్వాధీనంలోకి వచ్చింది.

అయితే ఆ ఆధ్యాత్మికానుభూతి వెంకటరామన్‌లో పెద్ద పరివర్తన తెచ్చింది. ఆయన అలవాట్లన్నీ పూర్తిగా నశించిపోయాయి. ఆహారం విషయంలో ఇంతకు మునుపున్న యిష్టా యిష్టాలన్నీ నశించిపోయాయి. రుచిగా వున్నా లేకపోయినా, తాజాగా వున్నా లేక పాసిపోయినా సరే పట్టించుకోకుండా ఏ పదార్థాన్నైనా అలా మింగేసేవారు. బడికి వెళ్ళడమూ, నిత్య జీవితమూ యాంత్రికమైపోయాయి. మహర్షి మాటల్లోనే చెప్పాలంటే తాను ఏంపని చేసినా ఏదో పూనకం (ఆవేశం) ఆవేశించిన వానిలాగా ఆ అనుభూతిలో మునిగి చేసేవారు! ఒంటరిగా కూర్చున్నప్పుడు ఆ చైతన్యానుభూతి ఆయనను పూర్తిగా ముంచివేసేది. 'ఆ' అనుభూతిలో ఆయన పూర్తిగా లీనమయ్యేవారు. ఆ చైతన్యశక్తే 'తా'నయే వారు.

ఆ 'ఆవేశం'లోనే తరచుగా ఆయన మధురై లోని మీనాక్షీ సుందరేశ్వరుల దేవాలయానికి వెళ్ళి అక్కడ ఈశ్వరుడూ, మీనాక్షీదేవి, అరవై మువ్వురు నాయనార్ల విగ్రహాలను తదేకంగా చూస్తూ ఆనంద పారవశ్యంలో మునిగిపోయేవారు. ఆ ఆనందంలో ఒక్కొక్కసారి ఆయన చెక్కిళ్ళు కన్నీటితో తడిసి పోయేవి. ఆ మహాత్ములపై చూపిన అనుగ్రహాన్ని తనపై కూడా చూపమని చాలా ఆర్తితో భగవంతుని ప్రార్థించేవారు. భగవంతుడంటే ఆయనకప్పుడు గల 'పిచ్చి'లో, ఒక్కోసారాయన దేవుడు ఆ స్వర్గంనించి హఠాత్తుగా తన ముందు ప్రత్యక్షమౌతాడని ఎంతో ఆశగా ఆకాశంవైపు చూస్తూ గడిపేవారు. ఆ తర్వాత క్రమంగా ఆ చైతన్యానుభూతి ఆయన ఏ పని చేసినా చదువుతున్న, మాట్లాడుతున్నా, నడుస్తున్నా, కూర్చున్నా కొనసాగుతూ ఆ అనుభూతి ఆయనకు సహజమవడం మొదలైంది.



శాస్త్రిగారు మహర్షి హఠాత్మరణంతో భీతి చెంది మహర్షిని కౌగలించుకుని పెద్దగా దుఃఖించసాగాడు. తర్వాత అప్పటి అనుభవాన్ని గురించి చెప్తూ మహర్షి, "అంతసేపూ కుడివైపున గల ఆధ్యాత్మ హృదయం పనిచేస్తూనే వున్నట్లు నాకు తెలుస్తూనే వుంది. ఆస్థితిలో 15, 20 నిముషాలు గడిచాక హఠాత్తుగా ఆకాశంలో దూసుకుపోయే రాకెట్ లాగ ఏదో శక్తి కుడివైపు నుంచి ఎడమవైపుకు దూసుకుపోయింది. వెంటనే రక్తం అతివేగంగా ప్రవహించనారాంభించింది. వళ్ళంతా చెమటలు పట్టాయి. వెంటనే ఇంతకు ముందు అణగిపోయిన శారీరక క్రియలన్ని ముందుకంటే వేగంగానూ, శక్తివంతంగానూ జరుగుతున్నట్లు తోచింది. చర్మకాంతి, మొదలగు లక్షణాలన్ని యధాస్థితికి వచ్చాయి. మరలా జీవకళ తొణికిసలాడింది. నేను కనులు తెరచి వెళ్దామన్నాను. మరే ఆటంకమూ లేక మేము విరూపాక్ష గుహకు చేరుకున్నాము. నా జీవితంలో రక్తప్రసారము, గుండె కొట్టుకోవడము ఆగిపోయిన సంఘటన అదొక్కటే" అన్నారు. ఈ అనుభవాన్ని గురించి యోగపరిభాషలో మహర్షి యిలా వివరించారు. "యోగి యొక్క 'కుండలనీశక్తి' మేల్కొన్నప్పుడు 'మూలాధారం' నుంచి పరానాడి 'సుషుమ్న' ద్వారా సహస్రారం చేరుకుంటుంది. మరలా అక్కడనుంచి ఛాతీకి దిగువగా కుడివైపున వుండే హృదయ గ్రంథికి దిగివస్తుంది. నిర్వికల్ప సమాధిలో హృదయ గ్రంథి విచ్చుకుని మరల ముకుళించుకుపోతుంది. సమాధి సహజమైనప్పుడు అది శాశ్వతంగా నాశనమవుతుంది".

మహర్షి చెప్పిన ఈ వివరణ శాస్త్రంలో చెప్పబడిన వివరణకు సరిగా సరిపోతుంది. మహర్షికి రెండవసారి కలిగిన 'మరణానుభూతి' 1896లో శ్రీ శిరిడీ సాయిబాబా మూడురోజుల పాటు నిర్జీవమై మరలా తిరిగి సజీవులైన సంఘటనను గుర్తుకు తెస్తుంది. అయితే సాయిబాబా తనలా మూడురోజులు తర్వాత తిరిగి వస్తానని ముందే చెప్పారు. మహర్షి చెప్పలేదు. శ్రీరామకృష్ణ పరమహంస కూడ "మానవులనుద్ధరించడానికవతరించే 'ఈశ్వరకోటి'కి చెందిన వారికి మాత్రమే హృదయ గ్రంధి పూర్తిగా నాశనమయిన తరువాత దేహంలో ఎల్లవేళలా మేలుకొల్పి వుంచడం సాధ్యం. మామూలు యోగులకది అసాధ్యం" అన్నారు. వింతల్లోకెల్లా వింత ఏమిటంటే మహర్షి ఛాతి క్రింద కుడివైపున స్పృజిస్తే ఆయన హృదయ స్పందన ఇతరులకు కూడా స్పష్టంగా తెలిసేది. విశ్వనాధ అయ్యర్ గారు, నారాయణరెడ్డి గారు తమ చేతులను మహర్షి ఛాతిపైనుంచి మహర్షికి హృదయ స్పందన కుడివైపే కలుగుతున్నదని గుర్తించారు. తరువాత చాలాసార్లు మహర్షికూడా ఆ విషయాన్ని ధృవీకరించారు.

అలా ఒకచోట నుంచి మరొక చోటుకు మారుతూ మహర్షి 1898లో అరుణాచలేశ్వర పాదమని చెప్పబడే పవళకున్రు చేరారు. అక్కడనుంచి ఆయన తాను సాధించిన ఉన్నత స్థితికి సంకేతమా అన్నట్లు అరుణగిరి పర్వతాన్ని అధిరోహించి తన తండ్రి బిడి చేరారు. అప్పటినుంచి 1922లో అరుణగిరి దక్షిణపు వైపున గల ఆశ్రమస్థలానికి దిగివచ్చే వరకు పర్వతంపైనే నివసించారు.

అరుణాచలంపై మహర్షికి గల ప్రేమ యింతా అంతాకాదు. అరుణాచలమే తన గురువని, తండ్రియని, ఆయన చెప్తూవుండేవారు. అరుణాచలాన్ని గూర్చి ప్రస్తావన ఏ మాత్రం వచ్చినా, అరుణాచలాన్ని గురించి నాయనార్ల గురించి ఏం మాట్లాడినా ఆయనలో ప్రేమ పొంగులు వారేది. ఉద్వేగం తొంగిచూచేది. కళ్ళనుంచి బాష్పాలు కురిసేవి. శరీరం రోమాంచితమై ఆయన కంఠం గద్గదికమై ఇక సంభాషణలు కొనసాగించలేక పోయేవారు.

"అరుణాచలంలో కేంద్రీకృతమైన అద్భుతశక్తి ప్రపంచపు నలుమూలలనుంచీ ఎంతోమందిని ఇక్కడికి ఆకర్షిస్తుంది" అనేవారాయన. ఒకవేళ ఎవరైనా మహర్షి తప్ప మరింకెవరు ? అంటే "మరి, నన్ను ఆకర్షించిన శక్తేమట, నన్నే శక్తి లాక్కొచ్చిందో ఆ శక్తే అందరిని ఆకర్షిస్తుంది" అనేవారు.

1896 నుంచి 1908 వరకూ 12 సంILల పాటు మహర్షి దాదాపుగా ఎప్పుడూ కనులు మూసుకుని ధ్యానస్థులై వుండేవారు. అయితే 1908 తర్వాత ఆయన అధ్యాత్మిక కార్యం మరో మలుపు తిరిగింది. మధురైలో కలిగిన మరణానుభూతి ఒక మలుపైతే 1912లో అనుభవమైన మరో మరణానుభవం ఆయన జీవితంలో మరో మలుపు. 1912లో ఒక రోజాయన చెరువులో స్నానంచేసి విరూపాక్ష గుహకు తిరిగి వస్తున్నారు. త్రోవలో ఒక చోటాయనకు హఠాత్తుగా బాహ్య స్పృహ తప్పి పోతున్నట్లనిపించింది. పడిపోకుండా దగ్గరలోవున్న పెద్ద కొండరాయి దగ్గర పద్మాసనంలో కూర్చున్నారు. తర్వాత ఆ అనుభవాన్ని మహర్షే వివరించారు కూడా. హఠాత్తుగా ఆయన కళ్ళకు గోచరమౌతున్న ప్రకృతి దృశ్యమంతా అంతరించిపోయింది. భౌతిక దృశ్యానికి, తన దృష్టికి మధ్య కాంతివంతమైన ఏదో తెల్లని తెర దించబడినట్లుగా అనిపించింది. రక్త ప్రవాహము, శ్వాస నిలిచిపోయాయి, చర్మం పాలిపోయి, మృత్యు కళ వచ్చేసింది, గుండె కొట్టుకోటం మానేసింది. అయినా పద్మాసనంలో గల శరీరం ప్రక్కకు ఒరగక స్థిరంగానే వుంది. అప్పుడు మహర్షి చెంతనే ఉన్న వాసుదేవ



తాను మామూలుగానే వున్నట్లు తనకేం కానట్లు బయటకు కనిపించడానికి ఎంత ప్రయత్నిస్తున్నా ఆయనలోని 'మార్పు' ఎంత కొట్టవచ్చినట్లుందంటే, అలా వుండడమాయనకు సాధ్యంకాలేదు. అదోలా ఎందుకున్నావని, అసలేం జరిగిందో చెప్పమని కుటుంబ సభ్యులు నిలదీస్తే 'భరించలేని తలపోటు' వల్లనని చెప్పేవారు. అయితే కాలాంతరంలో మహర్షి "నిజానికది తలనొప్పి కానేకాదు. అదంతా నేననచిపెట్టుకున్న భరింపలేని తాపం. నా తలనొప్పి వల్ల కలిగిన చింతతో మా పిన్ని రోజూ ఏదో ఒక తైలాన్ని నా తలకు మర్దన చేసేది. అప్పటి నా తాపం నేను మధురై విడచి యిక్కడకి (అరుణగిరి) చేరే దాకా తీరనేలేదు" అన్నారు. ఆస్థితిలో ఆరు వారాలు గడిచాయి. ఒకరోజు వెంకటరామన్ బెయిన్ ఇంగ్లీషు గ్రామర్ ముందేసుకుని హోంవర్కు చేసుకుంటున్నారు. కొద్దిసేపటి తర్వాతాయనకు తాను చేసేపని నిస్సారంగా అర్థరహితంగా తోచింది. అసంకల్పితంగా పుస్తకాన్ని మూసి ప్రక్కన పెట్టేసి, పద్మాసనంలో కూర్చుని ఆత్మానుభూతిలో నిమగ్నులయ్యారు. ఆ గదిలోనే ఉన్న వెంకటరామన్ అన్నగారు యీ తంతంతా గమనిస్తూనే వున్నారు. కొద్దికాలంగా చదువును మరీ అశ్రద్ధచేస్తున్న తన తమ్ముని వైఖరి ఆయనకు చికాకు కలిగించింది. చదువుకోకుండా అలా పద్మాసనంలో కూర్చుని కళ్ళు మూసుకుని కూర్చున్న తన సోదరుడు నుద్దేశించి, "చదువూసంధ్యా మానేసి సన్యాసి కాదల్చుకున్నవారు ఇక యిక్కడ వుండడం మాత్రం దేనికి?" అంటూ వ్యంగ్యంగా పలికారాయన. అయితే వెంకటరామన్‌ను ఆ పరుష వాక్యాలేమీ బాధించలేదు. తానున్న యిప్పటి స్థితిలో ఆ యింటి 'ఉప్పు' తినే అర్హత తనకేమీలేదనే ఆయనకు కూడా తోచింది. వెంటనే ఎక్కడికైనా వెళ్ళిపోవాలనుకున్నారు. అయితే ఎక్కడికి వెళ్ళాలి? అనే ఆలోచన రాగానే అప్రయత్నంగా 'అరుణాచలం' ఆయన మనసులో మెదిలింది. అరుణాచలేశ్వరుడే తన అన్న ద్వారా తనను మందలిస్తూ తన చెంతకు పిలుస్తున్నాడనిపించింది. అంతే ! ఆపై ఒక్కక్షణం కూడా ఆయన ఆగలేదు. వెంటనే లేచి అన్నగారి పెట్టెలోంచి అయిదు రూపాయలు తీసుకుని, తనను వెతకనవసరంలేదని క్లుప్తంగా ఒక చీటీపై రెండు ముక్కలు వ్రాసిపెట్టి – అరుణాచలానికి బయల్దేరారు. చిత్రమేమిటంటే ఆయనకు తెలీకుండానే "యదాహరేవ విరజిత్ తధాహవరేవ ప్రవరజేత్" (వైరాగ్యం కలిగిన వెంటనే, సర్వాన్నీ తక్షణం పరిత్యజించు ) అని పలికిన శృతి వాక్యం ఆయనపట్ల అక్షరాల నిజమైంది.

17 సంILల యువకుడైన వెంకటరామన్‌కు ఒక్క తలపుతోనే మైమరపింపజేసే 'అరుణాచలం' విశాల భారతావనిలో ఎక్కడుందో కూడా తెలీదు. ఒక పాత అట్లాసులో

ఆయన అరుణాచలానికి పోయే మార్గాన్ని గుర్తించి పొరపాటువల్ల మరో ఊరికి పోయే రైలెక్కి కూర్చున్నారు. అయితే ఆ రైల్లోనే ఒక ముస్లిం ఫకీరు ఆయనకు త్రోవలో వచ్చే ఒక స్టేషన్లోదిగి మరొక రైలు ఎక్కమని చెప్పి చిత్రంగా రైలు ప్రక్క స్టేషన్లో ఆగేలోగా అదృశ్యులయ్యారు!

తిరువణ్ణామలై గడ్డపై 1896 సెప్టెంబరు ఒకటో తేదీన కాలూనిన వెంకటరామన్, ఎక్కడా ఆగకుండా నేరుగా అరుణాచలేశ్వరుని ఆలయానికి వెళ్ళి అరుణాచలేశ్వరుని ముందు ఒంటరిగా, నిశ్శబ్దంగా అవధులు లేని ఆనందంలో చాలసేపు నిలుచుండి పోయారు. అప్పటినుంచి ఆయన 1950వ సం॥లో మహాసమాధి పర్యంతం అరుణాచలాన్ని విడచి ఒక్క రోజుకూడ ఎక్కడకూ వెళ్లలేదు.

తర్వాతాయన ఆలయం బైటకు వచ్చి టౌనులో గమ్యం లేకుండా తిరుగసాగారు. ఇంతలో అపరిచితుడైన ఒక వ్యక్తి ఎదురై అకారణంగా "నువ్వు పిలక కత్తిరించుకుని గుండు చేయించుకుంటావా?" అని అడిగారు. అయోమయంలో పడ్డ వెంకటరామన్ అనాలోచితంగా తలవూపడమే తడవుగా ఆ అగంతకుడాయనను దేవాలయంలో పనిచేసే మంగలి యింట విడచి తనదారిన తాను వెళ్ళిపోయాడు. తలపులతో పాటు తలకూడా బోడియైన వెంకటరామన్ దగ్గరనే వున్న చెరువు వొడ్డుకు వచ్చి, తాను ధరించి వున్న ధోవతిని తీసివేసి అందులో ఒక పీలిక చింపి గోచీ పెట్టుకొని, మిగతా ధోవతీ, తనవద్ద మిగిలిన డబ్బు కూడా విసిరవతల పారేశారు. తర్వాతాయన జీవితంలో ఎన్నడూ డబ్బును తాకలేదు. చివరివరకు కౌపీనధారిగానే వుండిపోయారు. తర్వాత తన కులాన్ని సూచించే యజ్ఞోపవీతాన్ని కూడా తీసిపారేసి, తిరిగి దేవాలయానికి బయల్దేరారు. క్షురకర్మ తర్వాత తప్పక స్నానంచేసే ఆచారం వున్నా జడదేహానికి స్నాన సౌఖ్యం కలిగించడం వ్యర్థమనిపించి అలానే దేవాలయానికి బయలుదేరారు. అయితే హఠాత్తుగా సన్నని వానజల్లు మొదలైంది. వెంకటరామన్ ఆలయము చేరేసరికి పూర్తిగా తడిసిపోయారు. ఆయన స్నానం దానంతటదే పూర్తియింది. శాస్త్ర జ్ఞానం ఇసుమంతైనా లేని వెంకటరామన్ తనకు తెలీకుండా "ఋషియైనవాడు తల గొరిగించుకుని బాహ్యచిహ్నమైన యజ్ఞోపవీతాన్ని విసర్జించి బ్రహ్మస్థితిలో నిలిచిపోవాలి" అనే బ్రహ్మపనిషత్ వ్యాఖ్యానాన్ని ఆచరణలో పెట్టేశారు.


ఆలయ ప్రాంగణంలో ప్రవేశించి ఒకచోటు చూచుకుని గాఢమూ అంతరంగికము అయిన ఆత్మానుభూతిలో నిశ్చలంగా కూర్చున్నారు. మౌన వ్రతాన్ని పాటించాలని ఆయన




ఉద్దేశం కాకపోయినా ఎవరితోనూ మాట్లాడేవారే కాదు. మౌనం ఆయనకు సహజంగానే సిద్ధించింది. అంతేగాక మౌనవ్రత మాచరించే ఒక సాధువుని చూచి అది చాలా అనుకూలంగా వుంటుందని, ప్రశ్నలతో జనం వేధించరని గ్రహించి వెంటనే దాన్ని ఆదర్శంగా తీసుకున్నారు.

శరీరస్పురణ కూడా లేకుండా నిశ్చలంగా కూర్చున్న ఆయన నోట్లో ఎవరైనా పుణ్యాత్ములు ఆహారాన్ని బలవంతంగా పెట్టేవారు. ఊళ్ళోని పిల్లలు ఆయనపై రాళ్ళు రువ్వేవారు. అయితే ఆ వూళ్ళోనే తిరుగుతూవుండే శ్రీ శేషాద్రిస్వామి అనే గొప్ప అవధూత తరచు పిల్లలని అదిలిస్తూ, ఎవరికీ అందక ఆపదలు రాకుండా చూస్తుండేవారు. ఎప్పుడూ ఎవరికీ అందక ఏమీ పట్టించుకోక తిరుగుతూ ఉండే శేషాద్రిస్వామి ఆ యువతపస్విపై శ్రద్ధ చూపడం పట్టణ ప్రజలకు ఆశ్చర్యాన్ని, ఆసక్తిని కలిగించింది. పోకరీ మూకల దారిన పడకుండా వుండడానికి చుట్టూ మూగే గుంపుల నుంచీ తప్పించుకోడానికి దేవాలయ ప్రాంగణంలోనూ, పరిసర ప్రాంతాలలోనూ స్వామి తన 'నివాసం' మార్చుకోవలసి వస్తూండేది.

తిరువణ్ణామలై వచ్చాక మరలా స్నానం చేయకపోవడం వల్ల స్వామి శరీరమంతా మురికిపట్టి జుట్టంతా జడలుకట్టి పెద్ద గుబురుగా తయారయింది. కొంతకాలం అవధూతకుమల్లె పూర్తి నగ్నంగా కూడా ఉన్నారు. చీకిపోయిన గోచి మాత్రం ధరించి శరీరంపై ఏ యితర ఆఛ్ఛాదన లేకనే ఆయన పగలూ-రాత్రీ, ఎండనక-వాననక ఆలయ ప్రాంగణంలోని ఏదో ఓ చెట్టెక్రింద కూర్చుండేవారు. చలిరోజుల్లో కాళ్ళు రెండూ ముడుచుకుని తన తలను వంచి కాళ్ళ మధ్యలో యిరికించుకుని రాత్రంతా అలాగే కూర్చునేవారు. అది చూచిన ప్రజలంతా వీడో పిచ్చివాడని, జడుడని, అనుకుంటూ నిర్లక్ష్యదృష్టితో సాగిపోయేవారు. అది విన్న స్వామి మాత్రం నవ్వుకొని, ఇలాంటి పిచ్చిలోనే లోకమంతా మునిగిపోవాలనుకునేవారు. ఆ రోజులను గుర్తుచేసుకుంటూ, కాలాంతరంలో మహర్షి, "కాలం గడిచిపోతున్నదనే గుర్తింపు లేకుండానే పగలూ, రాత్రీ గడచిపోయేవి. నాకప్పుడు కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత కూడా శుభ్రం చేసుకోవాలన్న యోచనే వచ్చేదికాదు. ముఖమంతా భయంకరంగా తయారయింది. తల దుబ్బులా పెరిగి మట్టి, చెమట చేరి మైనపుముద్దలా వుండేది. గోళ్ళు చాలా పొడుగు పెరిగి వుండేవి. వాటిని చూచి జనం నేను చిన్నవాడిలా కనిపిస్తున్నప్పటికి నా వయసు కొన్ని వందల సంవత్సరాలు వుండి వుంటుందని అనుకొనేవారు" అని చెప్పారు.


శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!!
గురుకృప
సద్గురు అనుగ్రహ కరదీపిక
శ్రీరామనవమి సంచిక
గురోవినతీమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగ్‌హే గురు స్వరూప చీ రసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా


మహాత్ముని జీవితము, వారి ద్వారా జరిగే లోకహితకార్యము కూడా నిత్యసత్యాలే!
వాటికి ఆది-అంతం రెండూ వుండవు.